షెడ్యూల్ ప్రకారమే గ్రూప్స్ పరీక్షలు

మొదటిపేజీ తరువాయి...

నిర్వహించనున్నది. గ్రూప్-1లోని 563 పోస్టుల కోసం 4.03 లక్షల మంది ప్రిలిమ్స్‌కు దరఖాస్తు చేసుకోగా, 3లక్షల మంది హాజరైనట్టు సమాచారం. ప్రిలిమ్స్ ఫలితాల్లో 1:50 నిష్పత్తి ప్రకారం మెయిన్‌కు అభ్యర్థుల ఎంపిక కొనసాగుతున్నది. 2022 లో విడుదలైన గ్రూప్-2 నోటిఫికేషన్‌లో 783 ఖాళీలు ప్రకటించారు. గ్రూప్-2 పోస్టులకు ఆగస్టు 7, 8న రాతపరీక్షలు నిర్వహించనున్నారు. నవంబర్ 17, 18న గ్రూప్-3 పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. నోటిఫికేషన్‌లో 1388 పోస్టులు ప్రకటించారు.

1:100 నిష్పత్తి పాటించాలి

షెడ్యూల్ ప్రకారమే గ్రూప్స్ పరీక్షలు నిర్వహించడానికి అధికారులు సిద్ధమవుతుంటే, నిరుద్యోగుల్లో ఉత్కంఠ పెరుగుతుంది. గ్రూప్-2, గ్రూప్-3లో రాత పరీక్షలు నిర్వహించలేదు. ఈలోపే గ్రూప్-2లో 2000, గ్రూప్-3లో 3000 వరకు పోస్టులు పెంచాలని నిరుద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. గ్రూప్-1 మెయిన్‌కు 1:100 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయాలని కోరుతున్నారు. అదనపు పోస్టులు పెంచాలని పేర్కొన్నారు. డిమాండ్ల సాధనకు నేడు నిరుద్యోగులు ఇందిరా పార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నారు.

అభ్యర్థుల సంఖ్య వెల్లడించాలి

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 19: గ్రూప్-1 పరీక్ష జరిగి పది రోజులు గడిచి నా ఇప్పటివరకు అభ్యర్థుల సంఖ్యను వెల్లడించడం లేదని విద్యార్థులు, నిరుద్యోగులు మండిపడ్డారు. ఆర్ట్స్ కళాశాల ఆవరణలో టీఎస్‌పీఎస్సీ వైఖరికి వ్యతిరేకంగా బుధవారం నిరసన వ్యక్తంచేశారు. పరీక్ష రాసిన అభ్యర్థుల సంఖ్యకు కచ్చితమైన లెక్కలు చెప్పకపోతే అవకతవకలు జరిగే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తంచేశారు. గ్రూప్-1 అభ్యర్థులకు న్యాయం జరిగేలా హైకోర్టు సుమోటోగా కేసును స్వీకరించాలని కోరారు. దీనిపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖ రాస్తామని చెప్పారు.

గ్రేస్ మార్కులు హక్కు కాదు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ఎంబీబీఎస్ కోర్సులో గ్రేస్ మార్కులను తొలగిస్తూ నిరుడు మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) ప్రవేశపెట్టిన నిబంధనలు చట్టబద్ధమైనవేనని హైకోర్టు స్పష్టం చేసింది. గ్రేస్ మార్కులు పొందడం విద్యార్థుల హక్కేమీ కాదని, కొత్త నిబంధనలు అమల్లోకి వచ్చాకే పరీక్ష నిర్వహించినందున పాత నిబంధనల ప్రకారం గ్రేస్ మార్కులు కలపాలని ఆదేశాలు ఇవ్వబోమని తేల్చిచెప్పింది. ఎంసీఐ కొత్త నిబంధనలను సవాలు చేస్తూ పలువురు విద్యార్థులు దాఖలు చేసిన 6 పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్‌కుమార్ ధర్మాసనం బుధవారం ఈ తీర్పును వెలువరించింది. అయితే ప్రత్యేక పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పిటిషనర్లకు గ్రేస్ మార్కుల అంశాన్ని ప్రతివాదులు పరిశీలించవచ్చని హైకోర్టు పేర్కొంటూ విద్యార్థుల పిటిషన్లపై విచారణను ముగిస్తున్నట్టు ప్రకటించింది.

నేటి నుంచి పాలిటెక్నిక్ వెబ్ కౌన్సెలింగ్

అందుబాటులో 26,412 సీట్లు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): పాలిసెట్ మొదటి విడత వెబ్ కౌన్సెలింగ్ గురువారం నుంచి ప్రారంభం కానున్నది. దీంతో విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు చెల్లించి, స్లాట్ బుక్ చేసుకోవాలి. ఈ నెల 22 నుంచి 25 వరకు సర్టిఫికెట్ వెరిఫికేషన్, 22 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, ఈ నెల 30లోపు సీట్లను కేటాయిస్తారు. పాలిటెక్నిక్ కోర్సుల్లో నిరుడితో పోల్చితే ఈ ఏడాది 1,122 సీట్లు అదనంగా చేరాయి. నిరుడు 25,290 సీట్లుండగా, ఈ ఏడాది 26,412కు చేరింది. 115 కాలేజీల్లో (58 ప్రైవేట్, 57 ప్రభుత్వ) 26వేలకు పైగా సీట్లకు అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఇటీవలే అనుమతి ఇచ్చింది. ఈ సీట్లను కన్వీనర్ కోటాలో వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా భర్తీచేస్తారు.

• తాగునీటి కోసం రోడ్డెక్కిన మహిళలు

తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని అంబేద్కర్‌నగర్ కాలనీ మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. వారం రోజులుగా తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. -నార్నూర్

• అద్దె ఇవ్వలేదని ఎంపీడీవో ఆఫీసుకు తాళం

అద్దె చెల్లించడం లేదంటూ మంచిర్యాల జిల్లా కన్నెపల్లి ఎంపీడీవో కార్యాలయానికి భవన యజమాని బుధవారం తాళం వేశాడు. కొన్ని నెలలుగా అద్దె చెల్లించకపోవడంతో యజమాని మురళీధర్‌రావు ఎంపీడీవో ఆఫీస్‌కు తాళం వేశాడు. అద్దె రూ. 1.17 లక్షలు రావాల్సి ఉందని, మొత్తం చెల్లించే వరకు తాళం తీయనని తెలిపాడు. -కన్నెపల్లి

కీచక ఎస్ఐ డిస్మిస్

- మహిళా హెడ్ కానిస్టేబుల్‌పై కాళేశ్వరం ఎస్సై లైంగికదాడి
- రివాల్వర్‌తో బెదిరించి పలుమార్లు అఘాయిత్యం
- మరో ఇద్దరికీ లైంగిక వేధింపులు
- ఎస్పీకి ఫిర్యాదుతో భవానీసేన్ అరెస్టు.. రిమాండ్
- సర్వీస్ నుంచి తొలగిస్తూ ఉత్తర్వులు

జయశంకర్ భూపాలపల్లి/ హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ప్రజలకు రక్షణగా నిలవాల్సిన ఎస్ఐ కీచకుడిగా మారాడు. తన పోలీస్‌స్టేషన్‌లోనే విధులు నిర్వర్తిస్తున్న మహిళా కానిస్టేబుల్‌పై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె ఎస్పీకి ఫిర్యాదు చేయడంతో ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాళేశ్వరంలో ఎస్సైగా పనిచేస్తున్న భవానీసేన్‌ను అదే స్టేషన్‌లో పనిచేస్తున్న ఒక మహిళా హెడ్‌కానిస్టేబుల్‌పై లైంగికదాడికి పాల్పడ్డాడనే ఆరోపణలపై పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. లైంగికదాడిని సీరియస్‌గా పరిగణించిన ప్రభుత్వం ఆయనను డిస్మిస్ చేసింది. ఎస్సై హోదాను అడ్డుపెట్టుకుని పోలీస్ శాఖ కీర్తి ప్రతిష్ఠలను దిగజార్చేలా వ్యవహరించడంతో భవానీసేన్‌పై ఎలాంటి విచారణ లేకుండానే ఆర్టికల్ 311 ప్రకారం సర్వీసు నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్టు మల్టీజోన్-1 ఐజీ ఏవీ రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాళేశ్వరం పాత పోలీస్ స్టేషన్ బిల్డింగ్‌లో రెండో అంతస్తులో ఎస్సై నివసిస్తుండగా, గ్రౌండ్‌ఫ్లోర్‌లో మహిళా కానిస్టేబుల్ నివాసం ఉంటున్నారు. ఒంటరిగా నివసిస్తున్న ఆమెను ఎస్సై పలుమార్లు లైంగిక వేధింపులకు గురిచేయగా తీవ్రంగా ప్రతిఘటించింది. ఎస్సై భార్య ఇంట్లో లేని పది రోజులు ఆమెను టార్చర్ పెట్టాడు. ఇంట్లో ఆమె ఒంటరిగా ఉన్న సమయంలో బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. మరో రోజు తాను బాత్రూంలో కింద పడ్డానని సదరు కానిస్టేబుల్‌కు ఫోన్ చేసి పిలిచి రివాల్వర్‌తో బెదిరించి లైంగికదాడికి పాల్పడ్డాడు. విషయం బయటకు చెప్తే చంపేస్తానని బెదిరించడంతో ఇంతకాలం వెలుగులోకి రాలేదు. కాగా ఎస్సై తరచూ వేధింపులకు గురి చేస్తుండటంతో విసిగిపోయిన బాధితురాలు చివరకు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేసింది. దీంతో ఈ వ్యవహారంపై విచారణ జరిపేందుకు భూపాలపల్లి డీఎస్పీ సంపత్‌రావును విచారణ అధికారిగా ఎస్పీ కిరణ్ ఖరే నియమించారు. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి ఎస్సైని అదుపులోకి తీసుకుని విచారణ జరిపారు. బాధితురాలితోపాటు స్టేషన్‌లోని మరి కొందరు సైతం ఎస్సై వేధింపులకు పాల్పడినట్టు విచారణ అధికారికి వివరించారు. కాళేశ్వరంలో మరో ఇద్దరిని, అన్నారంలో ఒక మహిళను సైతం ఎస్సై లైంగికంగా వేధించినట్టు ఫిర్యాదుచేశారు. దీంతో ఎస్సై భవానీసేన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం విచారణ జరిపారు. ఈ సందర్భంగా ఎస్సై ఎవరికీ చెప్పకుండా కారెక్కి వెళ్లిపోయేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకుని తీసుకొచ్చి విచారణ జరిపినట్టు తెలిసింది. కాగా ఎస్సైపై లైంగికదాడి, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద 449, 376(2), 324, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేసి భూపాలపల్లి కోర్టులో హాజరుపరచగా, జడ్జి 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితుడిని పరకాల సబ్ జైలుకు తరలించారు.

ఆదినుంచీ ఇదే తీరు

ఎస్సై భవానీసేన్ తీరు ఆదినుంచీ వివాదాస్పదమే. పని చేసిన ప్రతి చోటా ఫిర్యాదులే. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన ఎస్సైగా పనిచేసిన సమయంలో ఒక మహిళపై లైంగికదాడికి ప్రయత్నించగా ఉన్నతాధికారులు కేసు నమోదు చేశారు. కాళేశ్వరంలో ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఒక ఖద్దరు నేత అండదండలతో ప్రతి ఒక్కరినీ ఏదో రకంగా వేధింపులకు గురిచేసినట్టు ఆరోపణలున్నాయి. అందరితోనూ దురుసుగా ప్రవర్తించేవాడు. తనకు పెద్దల అండ ఉన్నదంటూ సదరు ఖద్దరు చొక్కా పేరు చెప్పుకుని మరీ దందా నడిపించాడు. కాళేశ్వరానికి చెందిన ఒక వ్యక్తి 'సింగం-3' అనే పేరుతో ఇచ్చిన తన ఫొటోను సీటు పక్కనే సినిమా హీరో స్టైల్లో పెట్టుకునేవాడని చెప్పుకుంటున్నారు. ఆటో డ్రైవర్ దగ్గరి నుంచి కాంట్రాక్టర్ల వరకు నెలవారీ మామూళ్లు ముట్ట జెప్పుకోవాల్సిందే.

ఏసీబీ ట్రాప్‌కు ప్లాన్?

ప్రతి ఒక్కరి వద్ద అందిన కాడికి దోచుకునే ఎస్సై భవానీసేన్‌పై అందరూ విసిగిపోయారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనన్న భయంతో వెనుకడుగు వేశారు. కాగా కాళేశ్వరానికి చెందిన ఒక మాజీ ప్రజాప్రతినిధి మాత్రం ఎస్సై వేధింపులు భరించలేక ఏసీబీ అధికారులను ఆశ్రయించినట్టు తెలిసింది. కాగా రెండు రోజులుగా ఏసీబీ అధికారులు అతనిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు కాళేశ్వరంలోనే మకాం వేసినట్టు సమాచారం. సదరు ప్రజాప్రతినిధి సహకారంతో బుధవారం ఎస్సైని ట్రాప్ చేసేందుకు ఏసీబీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేసుకున్నట్టు తెలిసింది. అయితే, మంగళవారం అర్ధరాత్రి ఎస్సై అరెస్టు కావడంతో ఏసీబీ ట్రాప్ నుంచి తప్పించుకున్నట్టు విశ్వసనీయ సమాచారం.

శాంతిభద్రతలను కాపాడాలి: హరీశ్‌రావు

వరుసగా జరుగుతున్న హత్యలు, లైంగికదాడులు, హింసాయుత ఘటనలే రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయనడానికి నిదర్శనమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు విమర్శించారు. పెద్దపల్లి జిల్లాలో ఆరేండ్ల చిన్నారిపై అత్యాచారం, హత్య ఘటన మరచిపోక ముందే, మరో దారుణం చోటుచేసుకోవడం విషాదకరమని పేర్కొన్నారు. రక్షించాల్సిన పోలీసే, తోటి మహిళా కానిస్టేబుల్‌ను భక్షించే దుర్ఘటన భూపాలపల్లి జిల్లాలో జరగడం అత్యంత హేయమైనదని ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి కారకుడైన ఎస్సైపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తున్నదని తెలిపారు. గడిచిన వారం రోజుల్లో నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలో అందరూ చూస్తుండగా సంజీవ్‌ను కర్రలతో కొట్టి చంపడం, హైదరాబాద్‌లోని బాలాపూర్‌లో అందరూ చూస్తుండగా సమీర్‌ను దారుణంగా పొడిచి చంపడం లాంటి ఘటనలను ఉదహరించారు. గత పదేండ్లలో శాంతిభద్రతలకు చిరునామాగా మారిన తెలంగాణలో, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే భద్రత ప్రశ్నార్థకం కావడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుని శాంతిభద్రతలు కాపాడాలని కోరారు.

డిమాండ్ల సాధనకు నిరుద్యోగుల ధర్నా నేడే

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో గ్రూప్-2, గ్రూప్-3లో పోస్టులు పెంచాలని, గ్రూప్-1 మెయిన్‌కు 1:100 నిష్పత్తి ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేయాలని, డిసెంబర్‌లో గ్రూప్స్ పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్ల సాధన కోసం ఈ నె 20న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు ధర్నా నిర్వహించనున్నట్టు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తున్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి వ్యతిరేకంగా భారీ ధర్నాకు పిలుపునిచ్చినట్టు నిరుద్యోగులు వెల్లడించారు.

బీఆర్ఎస్ మద్దతు: ఆర్ఎస్పీ

నిరుద్యోగ సమస్యల పరిష్కారానికి గురువారం నిరుద్యోగ సంఘాల జేఏసీ, అశోక్ చేయబోతున్న మహాధర్నాకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఎక్స్ వేదికగా ఆయన స్పందించారు. 'తెలంగాణలో గ్రూప్-2, 3 పోస్టులను పెంచాలి. జీవో 46 బాధిత అభ్యర్థులకు సత్వరమే న్యాయం చేయాలి. డీఎస్సీ అభ్యర్థులు ప్రిపేర్ కావడం కోసం మరికొంత సమయం ఇవ్వాలి. టెట్ స్కోర్లను నార్మలైజ్ చేశాకే డీఎస్సీ నిర్వహించాలి. ఏఈఈల నియామకం జరపాలి. కాంగ్రెస్ జాబ్ క్యాలెండర్, నిరుద్యోగ భృతిని అమలు చేయాలి. గురుకుల బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.' అని డిమాండ్ చేశారు.

పోలీసులకు మానవత్వం నేర్పించండి

కాళేశ్వరంలో మహిళా కానిస్టేబుల్‌పై లైంగికదాడికి పాల్పడిన ఎస్సై ఉదంతంపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలిచివేసిందన్నారు. 'ట్రైనింగ్‌లో కవాతు, దేహధారుడ్యం, చట్టాలను యాంత్రికంగా అమలుపరచడమే నేర్పిస్తే సరిపోదని, మానవత్వం, సాటి వ్యక్తులను గౌరవించమూ నేర్పండి' అంటూ డీజీపీకి విజ్ఞప్తి చేశారు.

జర్నలిస్టుల అక్రెడిటేషన్ గడువు 3 నెలలు పెంపు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వర్కింగ్ జర్నలిస్టుల అక్రెడిటేషన్ గడువును సెప్టెంబర్ 30 వరకు పొడిగించినట్టు రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంత రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు జిల్లాస్థాయి అక్రెడిటేషన్ కమిటీ చైర్మన్లు, జిల్లా కలెక్టర్ తగు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు.



పీఈసెట్ ఫలితాలను విడుదల చేస్తున్న ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, అధికారులు

టాప్ 10లో 9 మంది అమ్మాయిలే

పీఈసెట్ ఫలితాలు విడుదల • 96 శాతం అభ్యర్థులు క్వాలిఫై

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పీఈసెట్) ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. హైదరాబాద్ మాసబ్‌ట్యాంక్‌లోని తన కార్యాలయంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్ లింబాద్రి, శాతవాహన వర్సిటీ ఇంచార్జి వీసీ నరేంద్ర మోహన్ ఈ ఫలితాలను వెల్లడించారు. 96.49శాతం అభ్యర్థులు అర్హత సాధించినట్టు తెలిపారు. పీఈసెట్ ద్వారా బ్యాచిలర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (బీపీఈడీ) కోర్సులో ప్రవేశాలకు 1,650 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకొన్నారు. వీరిలో 1,198 మంది పరీక్షలకు హాజరు మొత్తం 1,198 (96.49శాతం) మంది క్వాలిఫై అయ్యారు. డిప్లామా ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ (యూజీ – డీపీఈడీ) కోర్సులో ప్రవేశాలకు 742 మంది దరఖాస్తు చేసుకొన్నారు. వీరిలో 507 మంది పరీక్షలకు హాజరుకాగా, 489 మంది (96.45శాతం) అర్హత సాధించారు. ఉన్నత విద్యామండలి వైస్‌చైర్మన్లు వెంకటరమణ, మహమూద్, కార్యదర్శి వెంకటేశ్, పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ మదన్‌మోహన్, పీఈసెట్ కన్వీనర్ రాజేశ్‌కుమార్ ఉన్నారు.

సత్తా చాటిన అమ్మాయిలు

పీఈసెట్ ఫలితాల్లోనూ అమ్మాయిలే సత్తా చాటారు. బీపీఈడీ, యూజీ డీపీఈడీ రెండింటి టాప్ -10 ర్యాంకుల్లో 9 ర్యాంకులను అమ్మాయిలే కైవసం చేసుకొన్నారు. బీపీఈడీలో గొల్ల మహేశ్వరి టాపర్‌గా నిలువగా, సీహెచ్ పద్మశ్రీ, తెల్లం ప్రియాంక, గుగులోతు అఖిల, జూకంటి రంజిత, జానపాటి శ్రీవిద్య, కొండ భవాని, బీ మౌనిక, ఆత్రం గీతాంజలి టాప్ 10 ర్యాంకులను కైవసం చేసుకోగా, వీరిలో సుమంత్ మాత్రమే అబ్బాయి కావడం విశేషం. యూజీ డీపీఈడీలో చట్టి మల్ల సంధ్య టాపర్‌గా నిలువగా, నగ్మా, అంజలి, జంగుబాయి, అఖిల, కుసుమ, రాజేశ్వరి, శిరీష, సోని టాప్ -10 ర్యాంకులను దక్కించుకొన్నారు. వీరిలో ఒక్క అబ్బాయి జైపాల్ మాత్రమే ర్యాంకు సాధించారు.

సీట్లు ఎక్కువ.. క్వాలిఫయర్లు తక్కువ

ఇంజినీరింగ్, లా, ఎంబీఏ, ఎంసీఏ ఇలా ఏ కోర్సును తీసుకున్నా సీట్లు తక్కువగా ఉండి.. క్వాలిఫై అయ్యేవారు ఎక్కువగా ఉంటారు. కానీ, బీపీఈడీ, యూజీ – డీపీఈడీ మాత్రం ఇందుకు భిన్నంగా ఉన్నాయి. ఈ రెండు కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించిన పీఈసెట్‌లో క్వాలిఫై అయిన వారు తక్కువగా ఉండగా, కాలేజీల్లో సీట్లు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 14 బీపీఈడీ కాలేజీలుండగా, వీటిల్లో 1,365 సీట్లున్నాయి. ఇక మరో మూడు డిప్లామా కోర్సులను నిర్వహించే కాలేజీలుంటే వీటిల్లో 300 సీట్లున్నాయి. మొత్తంమీద 17 కాలేజీల్లో 1,665 సీట్లుంటే, ఈ ఏడాది పీఈసెట్‌లో కేవలం 1,645 మంది అభ్యర్థులు మాత్రమే క్వాలిఫై అయ్యారు. అంటే అందరూ కాలేజీల్లో చేరినా 20 సీట్లు మిగలనుండటం గమనార్హం.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి

- ఇందిరాపార్క్‌లో కాలేజీ యాజమాన్యాల శాంతిదీక్ష
- 900 కాలేజీల నుంచి దీక్షకు హాజరైన ప్రతినిధులు



ప్రభుత్వం వెంటనే ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని కోరుతూ బుధవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద దీక్ష చేపట్టిన వివిధ కాలేజీల యాజమాన్యాలు

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదలచేయాలని డిమాండ్ చేస్తూ ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీల యాజమాన్యాలు రోడ్డెక్కాయి. తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కాలేజీ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (టీపీడీపీఎంఏ) ఆధ్వర్యంలో బుధవారం ఇందిరాపార్క్‌లోని ధర్నాచౌక్‌లో శాంతిదీక్షను నిర్వహించాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి తరలివచ్చిన 900 కాలేజీల యాజమాన్యాలు ఈ దీక్షలో పాల్గొన్నాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని కోరుతూ తాము సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క సహా అందరిని కలిశామని, అయినా బకాయిలు విడుదలకాలేదని యాజమాన్యాల ప్రతినిధులు ఆవేదన వ్యక్తంచేశారు. పలు కాలేజీలు మూసివేత అంచుల్లో కొట్టుమిట్టాడుతున్నాయని, ప్రభుత్వం బకాయిలను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ బీ సూర్యనారాయణరెడ్డి, రామకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎక్కల్‌దేవి పరమేశ్వర్, శ్రీధర్‌రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీ జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్ కాలేజీలను వేరుచేయాలి

ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకంలో ప్రొఫెషనల్, నాన్ ప్రొఫెషనల్ కాలేజీలను వేరుచేయాలి.ఏటా ప్రభుత్వం ఈ పథకానికి రూ.2,500 కోట్లు కేటాయిస్తున్నది. దీంట్లో 40% నాన్ ప్రొఫెషనల్ కాలేజీలకు, మిగతా 60% ప్రొఫెషనల్ కాలేజీలకే వెళ్తున్నది. ప్రొఫెషనల్ కాలేజీలతో మమ్మల్ని జత చేయడంతో మాకు అన్యాయం జరుగుతున్నది.

- ఎక్కల్‌దేవి పరమేశ్వర్, టీడీడీపీఎంఏ వర్కింగ్ ప్రెసిడెంట్

ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడంతో కాలేజీ భవనాల అద్దెలు, సిబ్బంది జీతాలు చెల్లించలేక కాలేజీ యాజమాన్యాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఒక్కో కాలేజీ కోటి రూపాయల నుంచి నాలుగు కోట్ల వరకు అప్పులు తీసుకున్నాయి. కొన్ని కాలేజీలు మూతపడగా, మరికొన్ని కాలేజీలు మూసివేత అంచుల్లో ఉన్నాయి. రెండు నెలల్లో అప్పుల బాధతో నలుగురు కాలేజీ నిర్వాహకులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరిస్తుందని ఆశిస్తున్నాం.

- సూర్యనారాయణరెడ్డి, టీడీడీపీఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు

ఐజేయూ నేతల వాగ్వాదం

- టీయూడబ్ల్యూజే మహాసభలో ఘటన
- అమర్, శ్రీనివాస్‌రెడ్డి మధ్య మాటామాటా

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ) : ఖమ్మంలో బుధవారం ప్రారంభమైన టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర మహాసభలో యూనియన్‌కు చెందిన ఇద్దరు కీలక నేతల మధ్య వాగ్వాదం జరిగింది. ఉదయం ప్రారంభ సభ, మధ్యాహ్నం రాష్ట్ర డెలిగేట్ల సమావేశం నిర్వహించారు. ఇందులో యూనియన్ కార్యకలాపాల నివేదికను కార్యదర్శి రాష్ట్ర నాయకులకు చదివి వినిపించారు. ఈ క్రమంలో పలువురు వక్తలు మాట్లాడిన తర్వాత సమావేశం ముగిసినట్టు ప్రకటించగా ఐజేయూ మాజీ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మీడియా మాజీ సలహాదారు దేవులపల్లి అమర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాను మాట్లాడుతానని అధ్యక్షుడిని ముందుగానే అనుమతి అడిగానని, అయినా ఉద్దేశపూర్వకంగా సమావేశాన్ని ముగించడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. తనకు మాట్లాడే అవకాశం ఇవ్వకపోవడానికి కారణమేమిటో చెప్పాలని అమర్ పట్టుబట్టగా తనకు దురుద్దేశాలను ఆపాదించడం మంచిది కాదని, ఎవరిని ఎప్పుడు మాట్లాడించాలన్న అంశం అధ్యక్ష స్థానంలో ఉన్నవారిది మాత్రమేనని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్, ప్రస్తుత అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి బదులిచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలో ఇద్దరూ కొంతసేపు వాదనకు దిగగా నాయకులు జోక్యం చేసుకొని సర్దిచెప్పినట్టు సమాచారం. ఐజేయూ జాతీయ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఏపీ ప్రభుత్వ మీడియా సలహాదారుగా అమర్ నియమితులయ్యారు. ఆ సమయంలో ఐజేయూ జాతీయ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ప్రస్తుత ఐజేయూ అధ్యక్షుడు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా నియమితులు కావడంతో అదే సూత్రాన్ని వర్తింపజేయాలని అమర్ వర్గీయులు డిమాండ్ చేస్తున్నట్టు సమాచారం. ఇలానే మంగళవారం జరిగిన యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలోనూ కొత్త కమిటీ ఎన్నిక నిర్ణయంపైనా ఓ వర్గం కినుక వహించినట్టు ప్రచారం జరుగుతున్నది.

ఖాళీ ప్లాట్ల కబ్జా

- భూములపై ఓ మాజీ ప్రజాప్రతినిధి కన్ను
- వరంగల్‌లోని మారుతీకాలనీలో వెలసిన ఖనీలు
- భయందోళనలో కాలనీవాసులు

వరంగల్‌లోని మారుతీకాలనీలో కేఎం పేరుతో నాటిన ఖనీలు

వరంగల్, జూన్ 19 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : వరంగల్ నగరం 56వ డివిజన్‌లోని జవహర్‌కాలనీ రోడ్డు, మారుతీ కాలనీలోని ఖాళీప్లాట్లలో ఓ మాజీ ప్రజాప్రతినిధి అనుచరులు మంగళవారం రాత్రికిరాత్